నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 18వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 7వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుశాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 18వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

అంగన్వాడీల్లో ముఖ గుర్తింపు సాధ్యమేనా..!

- గత ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు మూలకు..

ప్రజాశక్తి -పుంగనూరు: జూలై 1 నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పంపిణీ సమయాల్లో లబ్ధిదారులు ముఖ గుర్తింపు కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సదుపాయాలు ద్వారా ఇది ఎంతవరకు సాధ్యం అనేది కార్యకర్తలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇలా లబ్ధిదారుల ముఖగుర్తింపు విధానంలో ఇప్పటికే ఉన్న యాప్ పనులతో సాంకేతిక సమస్యలతో పనిచేయక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పుంగనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 232 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీరిలో 1800 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. 3100 మంది చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే పనులకు సంబంధించి ఇప్పటికే పలు అంశాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. గతం ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల క్రితం ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు ప్రభుత్వం సెల్‌ఫోన్లను అందించింది. అయితే వీటిలో అధిక శాతం మేరా మూలకు చేరాయి. ఉన్న వాటిలోనూ సక్రమంగా పనిచేయకపోవడం, డేటా సరిపోకపోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అంగన్వాడీలు. చాలా చోట్ల సిబ్బంది సొంత సెల్ ఫోన్ ఉపయోగిస్తున్నారు. లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరుకులు ఇచ్చే సమయంలో కేంద్ర ప్రభుత్వం సంబంధించి పోషణ ట్రాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి బాల సంజీవని యాప్‌లను వీటిని కచ్చితంగా అప్లోడ్ చేయాలి. సెల్ ఫోన్‌లో ఉన్న నెట్వర్క్ సక్రమంగా పనిచేయక పనులు సకాలంలో పూర్తికాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సరుకులు ఇచ్చే సమయంలో లబ్ధిదారులు ఆధార్‌కు లింక్ అయినా సెల్ఫోన్‌కు వచ్చి ఓటీపీని ఎంటర్ చేయాలి. ఇదంతా చేయాలంటే ఎక్కువ సమయం పడుతుందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరే.. స్టవ్వుల సౌకర్యం ఏది..?

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అంగన్వాడీ కేంద్రాలను బలోపేతంపై దృష్టి సారించింది. నాణ్యమైన పౌష్టికాహారం మెరుగైన విద్యను అందించడానికి ఏర్పాటు చేసింది. గతంలో చిన్నారులకు వంట చేయడానికి సిలిండర్ గ్యాస్‌ను ఉపయోగించేవారు. కొన్నిసార్లు సకాలంలో బిల్లులు అందక సిబ్బంది ఇబ్బందులు పడేవారు. దీంతో విద్యుత్తుతో పనిచేసే ఇండక్షన్ స్టవ్‌లను కేంద్రాలకు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని కేంద్రాల్లో కూడా విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో ఉంది. అయినా ఇప్పటివరకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాటిని అందించిన దాఖలాలు లేవు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 232 కేంద్రాలకు గాను 120 సొంత భవనాలు ఉన్నాయి. 63 కేంద్రాలు అద్దె భవనంలో నడుస్తున్నాయి. 49 ఇతర ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలు నడుస్తున్నాయి. అన్ని కేంద్రాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. ప్రధాన కేంద్రాలు 177, మినీ కేంద్రాలు 55 ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. ప్రధానంగా పుంగనూరు పట్టణంలో ఉన్న 34 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీకి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దళితవాడపై వివక్ష తగదు

అడ్డంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను తొలగించాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

దళితవాడ పక్కన కడుతున్న గోడ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగిరి మండలం ధరణి దళితవాడకు ఎగువన ధరణి ఊరు ఉంది. రెండు ఊర్ల మధ్య అగ్రవర్ణాల వారికి చెందిన వ్యవసాయ భూములు ఉన్నాయి. పొలాల్లోకి పశువులు, మనుషులు వెళ్తున్నారని కుంటిసాకుతో దళితవాడ దగ్గర మాత్రమే ప్రహరీ గోడ నిర్మించడం అంటే వారి పట్ల వివక్ష పాటించడమేనని, వెంటనే ప్రహరీ గోడను తొలగించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి దళితవాడలో 80 కుటుంబాలు తరతరాలుగా నివసిస్తున్నారని, అక్కడున్న యువత చదువుకొని చైతన్యవంతులై అన్ని రకాల సమస్యలపై స్పందిస్తున్నారని దురుద్దేశంతో దళితవాడకి అడ్డంగా ప్రహరీ గోడ నిర్మించడం దారుణమన్నారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చిన నిర్లక్ష్యంగా వారి పొలంలో నిర్మించుకుంటే మీకేంటి అని ప్రశ్నించడం శోచనీయమన్నారు. రెండు ఊర్ల మధ్య ఉన్న పొలంలో కేవలం దళితవాడ దగ్గర మాత్రమే ప్రహరీ గోడను నిర్మించడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ధరణి దగ్గర ఉన్న నదిలో నిరంతరం అక్రమంగా ఇసుక తరలిస్తుంటే దళితవాడ యువత దాన్ని ప్రశ్నించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని అగ్రవర్ణాల రైతు దళితువాడ దగ్గర ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారని, అంతగా పశువుల ఇబ్బంది ఉంటే ఫెన్సింగ్ వేసుకోవచ్చు కానీ ప్రహరీ గోడ కట్టడం వివక్షే అవుతుందన్నారు. తరతరాలుగా దళితులు వివక్ష గురవుతూనే ఉన్నారు. 79 సంవత్సరాల స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న సందర్భంలో దళితులకు ఇదేనా గౌరవం ఇదేనా అన్నారు. పొలంలోకి మనుషులు, పశువులు ప్రవేశిస్తున్నారని సమస్య ఉంటే పొలం మొత్తం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి కానీ కేవలం దళితవాడ దగ్గర మాత్రమే నిర్మించడం అంటే వివక్ష కాదా అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ గోడ తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయని, దళిత ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ దళితుల సమస్యలపై ఏమాత్రం స్పందించలేదని విమర్శించారు.

జెవివి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం
జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- పలమనేరు: జన విజ్ఞాన వేదిక చిత్తూరు జిల్లా మహాసభ శనివారం పలమనేరులోని సాయిమేధ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విజయవంతంగా జరిగింది. ఆదివారం జిల్లా నూతన కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజలలో మూఢనమ్మకాలు, సూడో సైన్స్, అశాస్త్రీయ భావజాలం విపరీతంగా ప్రచారం అవుతోందని వీటిని అరికట్టి శాస్త్రీయ సమాజం నిర్మించాలంటే యువత చురుగ్గా జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రచయిత పలమనేరు బాలాజీ మాట్లాడుతూ వ్యక్తుల మధ్య సంబంధాలు అడగంటుతున్నాయని అశాస్త్రీయత పెరిగిపోతుందని వీటిని అరికట్టి సమాజం మంచి మార్గంలో ప్రయాణించడానికి జెవివి ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులు కరమల గిరిధరమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సెప్టెంబర్‌లో 13, 14 తేదీలలో విజయనగరంలో జరుగనున్న జెవివి రాష్ట్ర వార్షిక సమావేశం గోడపత్రికను రాష్ట్ర ఉపాధ్యక్షులు వైయస్ నాగేశ్వర్ ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.యుగంధర్ జెవివి కార్యక్రమాల గురించి వివరించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

చిత్తూరు జిల్లా జనవిజ్ఞాన వేదిక నూతన అధ్యక్షులుగా అరుణ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.యుగంధర్ బాబు, కోశాధికారిగా కర్మల గిరిధర్ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలచైతన్య, సీనియర్ నాయకులు మునిరత్నం, సుధాకర్, విజయ్ కుమార్, ఆనంద్ బెన్, సెల్వం, శ్యామల మేడం, రామలింగం పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మహతి పౌండేషన్ నిర్వాహకులకు ఘన సత్కారం

అమృత నాగరాజును సత్కరిస్తున్న శ్రీనివాసమూర్తి, గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కుప్పం పిఇఎస్ ఆసుపత్రి వైద్యుల బృందం, మహతి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. శిబిరంలో మొత్తం 263 మంది రోగులు పరీక్షల నిర్వహించారు. వారిలో 64 మందిని కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం రెపెర్ చేయగా, మిగిలిన వారికి మాత్రలు అందించారు. మహతి ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్ఆర్ఐ అమృత నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మేనేజర్ శ్రీనివాసులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, టిడిపి మండలాధ్యక్షులు కిషోర్ గౌడ్, పిఈఎస్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అమృత నాగరాజు దంపతులను తీర్థం కాలభైరేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శ్రీనివాస్ మూర్తి, గోవిందు స్వామి, రామ్మూర్తి ఘనంగా సత్కరించారు. తమ గ్రామానికి చెందిన నాగరాజు అమెరికాలో స్థిరపడినప్పటికీ సొంత ఊరి కోసం మహితి పౌండేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యాక్రమాలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. గ్రామస్తులకు విద్య,వైద్యం వంటివి నిత్యం అందుబాటులో ఉంచుతున్నారని కొనియాడారు.

చిన్న నాటి రోజులు గుర్తొచ్చాయి.. ఎమ్మెల్యే గురజాల



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహాభారత యజ్ఞం, దుర్యోధనుడు వధ నాటకం చూస్తుంటే తన చిన్ననాటి రోజులను గుర్తుతెచ్చుకున్నారు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్. ఆదివారం ఎమ్మెల్యే గురజాల ఐరాల మండలం మదిపట్లపల్లి గ్రామంలో శ్రీద్రౌపది దేవి సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా దుర్యోధనుని వధ ఘట్టాన్ని ఆసక్తిగా తిలకించారు. దుర్యోధనుడి గధ చేతబట్టి అలరించారు. కొన్ని ఏళ్లుగా మహాభారత యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రామస్తులను అభినందించారు. నాయకులు గురజాల సందీప్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహాభారతంలో భీముడికి దుర్యోధనకి జరిగిన మహాభారత యుద్ధంలో దుర్యోధన వద కార్యక్రమం ఆదివారం మండలంలోని తుంబకుప్పం గ్రామంలో ద్రౌపతమ్మ ఆలయ సమీపంలో జరిగినది 18 రోజులుగా మహాభారతం కథ కార్యక్రమాలు జరిగాయి దుర్యోధని బొమ్మ తీర్చి దుర్యోధనునికి తొడ భాగంలో గల ప్రాణవాయువు ఉంటుందని కృష్ణుడు తెలపడంతో భీముడు గదాయుధంతో తొడ భాగంలో కొట్టడంతో దుర్యోధన వద కార్యక్రమం జరిగినది అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపెట్టారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

75 వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రధాన ధ్యేయమని బొమ్మయ్యపల్లి సర్పంచ్ చొక్కా గోవిందయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామం నుండి పరిసర గ్రామాలకు సుమారు 75 కొత్త వీధి దీపాలు సర్పంచ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు రాత్రి వేళలో ఇబ్బంది లేకుండా పంచాయతీ నిధులతో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగినదన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం..: ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

ట్రాక్టర్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను ఏడాదిలోనే చేసి చూపామని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా పలమనేరులో ఆదివారం నియోజకవర్గంలోని రైతులు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్దచెరువు నుంచి మార్కెట్ యార్డ్ వరకు రైతులు ట్రాక్టర్లతో ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన రైతు సంబరాల సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పడం జరిగిందని చెప్పిన మాట ప్రకారం అమలు చేశామన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచకాలు అవినీతితో రాష్ట్రం అదా పాతాళానికి తొక్కడంతో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ గాడీలో పెట్టి కార్యక్రమాలు చేయడానికి ఏడాది పట్టిందని వివరించారు. పలమనేరులో రైతుల కోసం 33 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ సదుపాయాన్ని కల్పించనున్నామన్నారు. ఇక మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. సీనియర్ నాయకులు ఆర్‌వి.బాలాజీ, రామచంద్ర నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, ఆనంద, నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: ఆర్టీసీ బస్సులలో 11,449 బస్సులలో 5458 బస్సులలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని, రాష్ట్రంలోని 2.62 కోట్ల మంది మహిళలకు ఈ ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మోహన్ రాజ్, యువరాజు నాయుడు తెలిపారు.

రామకుప్పంలో టిడిపి సమావేశం

రామకుప్పం: స్త్రీ శక్తి పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ప్రారంభించారని, రాష్ట్రంలోని మహిళలకు, విద్యార్థినులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని, అందుకే ఇప్పటి వరకు ఏ పథకానికీ రానంత స్పందన ఈ పథకానికి వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. గంతలో బస్సు పాస్ కౌంటర్ల వద్ద విద్యార్థినులకు పడిగాపులు పడేవారని, ఇది బాలికా విద్యకు ప్రోత్సహంగా ఉంటుందన్నారు. వర్కింగ్ ఉమెన్‌కు ఈ స్కీం చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి అడ్డులేదని, సంక్షేమానికి తిరుగులేదని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకట్రామీగౌడు, నరసింహులు, సీతాపతి, రామ్మూర్తి, రఫీ పాల్గొన్నారు.

ఉచిత బస్సు పేరిట ప్రభుత్వం మహిళలను మోసం చేసింది: ఆర్కేరోజా

ప్రజాశక్తి -నగరి: ఉచిత బస్సు పథకం అమలు అంటూ కూటమి ప్రభుత్వం మహిళలకు పక్కాగా మోసం చేసిందని మాజీమంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. ఉచిత బస్సుకు పలు ఆంక్షలు విధించడంపై ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. తమది చేతల ప్రభుత్వం కాదని కోతల ప్రభుత్వం అని చంద్రబాబు మరోమారు నిరూపించారన్నారు. ఎన్నికల ముందు ప్రతి మహిళ ఉచితంగా రాష్ట్రమంతా తిరగొచ్చన్నారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక 14 నెలలు ఉచిత బస్సు ఊసే ఎత్తలేదన్నారు. ముక్కి మూలిగి ఇప్పుడు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించినా దానికి వంద మెలికలు పెట్టారన్నారు. ఎన్నికల ముందేమో ఏ ఆర్టీసీ బస్సెనా ఎక్కి మహిళ ఉచితంగా తిరుమల, అన్నవరం, విజయవాడ, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు బస్సులో వెళ్లవచ్చని భగవంతుడు పేరు చెప్పి ఓట్లు దండుకున్నారన్నారు. నేడు 16 రకాలు బస్సులు ఉంటే 5 బస్సుల్లో మాత్రమే పథకం అమలు చేస్తున్నారన్నారు. తిరుపతి నుంచి తిరుమలకు ఉచిత బస్సు ప్రయాణం లేదన్నారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వం కోతలు ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకుందన్నారు. సూపర్ సిక్స్ .. సూపర్ హిట్ అంటున్నారని అవి సూపర్ హిట్ కాదని, సూపర్ ఫ్లాప్ అని అన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్రతి ఒక్కరికి ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి ఒక్కరికి ఇవ్వలేదన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంపై మాజీ మంత్రి ఆర్కే రోజా స్పందించారు. ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా ప్రదర్శనను ఆపాలనుకోవడం అంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపినట్టే అవుతుందని రోజా వ్యాఖ్యానించారు. సినిమా బాగుంటే అది విజయవంతం కాకుండా ఎవరూ అడ్డుకోలేరని, బాగోలేకపోతే ఎవరూ దాన్ని ఆడించలేరని స్పష్టం చేశారు. ఈ విషయం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరి హర వీరమల్లు సినిమాతో నిరూపితమైందన్నారు. సినిమాలు, రాజకీయాలను మిక్స్ చేయడం మంచిది కాదన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి కూలిన ఇల్లు..

ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి- వీకోట : మండలంలోని బోయచిన్నాగన పల్లెలోని ఓ ఇంట్లో గ్యాస్ లీకై పేలుడు సంభవించడంతో పైకప్పు కుప్పకూలింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. శనివారం రాత్రి గ్రామంలో పెద్ద పేలుడు శబ్దం రావడంతో అందరూ ఇళ్ళ నుంచి బయటకు భయంతో పరుగులు తీశారు. పరిశీలించగా గ్రామానికి వెనక వైపు ఉన్న దామోదర్‌రెడ్డికి చెందిన ఇల్లు కుప్పకూలినట్లు గుర్తించారు. ఆ ఇంటిలో మడవలి గోవిందప్ప తన కుటుంబంతో కలిసి గత కొంతకాలంగా బాడుగకు ఉంటున్నాడు. శనివారం కావడి చెల్లించేందుకు ఆలయానికి వెళ్లడంతో పేలుడు సంభవించిన సమయంలో ఇంట్లో ఎవరు లేరు. దీంతో ప్రాణనష్టం తప్పిందని గ్రామస్తులు అంటున్నారు. ఇంటి పైకుప్ప కూలిన విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జావిద్ బాష సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకేజీ వల్లనే విస్ఫోటం జరిగినట్లు గుర్తించారు. రాత్రి చీకటి కావడంతో శిధిలాలను తొలగించేందుకు వీలుపడకపోవడంతో ఉదయం వరకు ఎవరు ఇంటి పరిసరాలకు వెళ్ళరాదని పోలీసులు సూచించారు. గ్రామంలో పేలుడు శబ్దం రావడంతో భూకంపం వచ్చిందని కొందరు ఇళ్ళ నుంచి పరుగులు తీశారు.

గ్యాస్ సిలిండర్ పేలుడికి కూలిన ఇంటి పై కప్పు

హుండీ ఆదాయం రూ.3.77లక్షలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్కంధ పుష్కణీ సమీపంలో కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి హుండీ ద్వారా రూ.3లక్షల 77వేల 624లు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈవొ కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన హుండీ లెక్కింపుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆడికృత్తిక సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ ద్వారా రూ.2లక్షల 77 వేల 624 లు వచ్చిందని, అలాగే శాస్వత హుండీ ద్వారా రూ.99 వేల 638లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం ఖజానాకు జమ చేస్తానని ఆయన పేర్కొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన సుబ్రమణ్యస్వామి వారు

రెండవ రోజు ఆదివారం ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారు శనివారం గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదే విధంగా సాయంత్రం అమ్మవార్లతో పాటు శ్రీసుబ్రమణ్యస్వామి వారిని ప్రత్యేక వాహనంపై కొలువు దీర్చి గ్రామవీధుల్లో మంగళవాయిద్యాలనడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. చాకలివాని గుంట ఎస్టీకాలనీకి చెందిన వారు శ్రీసుబ్రమణ్య స్వామివారికి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలు, పరిమళ భరిత పుష్పమాలికలను ప్రత్యేక వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సారెను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఎండోమెంట్ ఈవొ కృష్ణనాయక్, రవి యాదవ్, రాజశేఖర్, సాయిరాయల్ పాల్గొన్నారు.

గ్రామవీధుల్లో వేణుగోపాలుడి విహారం



ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం యాదవ కులస్తులతో ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో పాటు స్వామివారిని పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారు సాయంత్రం గ్రామ వీధుల్లో మేళ, తాకాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి ఊరేగించారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు పవిత్రోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఏఈఓ రవికుమార్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షారాబ్ బాబు సురేష్, వేద పండితులు రమేష్, గోపాల్, శబరిష్ పాల్గొన్నారు.

పెద్ద బాలశిక్ష.. విజ్ఞాన భాండాగారం

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప

ప్రజాశక్తి- గంగవరం: పెద్ద బాలశిక్ష పుస్తకం పాఠశాల స్థాయి విద్యార్థులకు విజ్ఞాన భాండాగారం వంటిదని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప అన్నారు. ఆదివారం కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పెద్ద బాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల చేత ఈ పుస్తకాన్ని రోజుకో గంటసేపు చదివిస్తే సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారన్నారు. సంస్థ అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు మాట్లాడుతూ ఈ పుస్తకాలు అన్నిటిని ఆసక్తి గల విద్యార్థులకు ఉచితంగా అందిస్తామన్నారు. పలమనేరు బాలాజీ, మాధవరెడ్డి, సీతారామయ్య, కన్నయ్య నాయుడు, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

పేదలకు వైద్య శిబిరం

తక్కువ ధరకే మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మాయా బజార్‌లోని కేవీ హాస్పిటల్ లో బీపీ, షుగర్ బాధితులకు వైద్య శిబిరం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతంలో గోపాల్ అన్న అతిపెద్ద కెవి హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి మంచి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వున్నారని వేలాది రూపాయలు మందులకే ఖర్చు అవుతున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో పేదకు కేవీ హాస్పిటల్ జిబిఆర్ ఫౌండేషన్ వారు 200 రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. పేదప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్, డాక్టర్లు త్రివిక్రమ్, కీర్తి నారా , లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

23న జర్మనీ నర్సింగ్ ఆఫ్ లైన్ శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడ గిరిజన భవనంలో ఈనెల 23వ తేదీ జర్మన్ నర్సింగ్ ఆఫ్ లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నెల్లూరు మల్లికార్జున్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సెక్రటరీ సూచనల మేరకు రాయలసీమ జోన్ నెల్లూరు కలుపుకుని తిరుపతిలో శిక్షణ ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రెటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఎండీ, సీఈవో, ఏపీ ఎస్ఎస్‌డిసి కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. జిఎన్ఎం కోర్సు పూర్తి చేసిన వారికి ఒక సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. బిఎస్‌సి నర్సింగ్ చేసిన వారికి ఆరు నెలలు అనుభవం ఉంటే సరి పోతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్‌సి, ఎస్‌టిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అనుమతి తప్పనిసరి: డిఎస్‌పి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని గూడూరు డిఎస్‌పి గీతా కుమారి పేర్కొన్నారు. గూడూరు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డిఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాలో డిజె, బాణాసంచాలకు అనుమతి లేదన్నారు. ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా కమిటి సభ్యులు చూసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగను ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్ , కిషోర్ బాబు , ఎస్ఐలు తిరుపతయ్య , మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌కి ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక సదాశివేశ్వర స్వామి ఆలయ పాలకమండలి నూతన చైర్మన్‌గా దిలీప్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు ఉమాపతిచెట్టి శివయ్య కార్యదర్శులు హేమాద్రి ఆధ్వర్యంలో బలిజ సంఘం భవనంలో ఆదివారం అందరూ శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వ రాయల్, గోపి రాయల్, డి జయప్రకాష్, రాజేంద్ర, కొడగంటి శ్రీనివాసులు, రమేష్, చక్రవర్తి, కృష్ణయ్య, మునెయ్య, నందయ్య, (ఓవిఆర్) వెంకటరమణ, పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

రైతుల హర్షం

ప్రజాశక్తి-తడ: తడ మండలంలో శనివారం రాత్రి నుండి ఆదివారం వరకు వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో నిమగ్నం కావచ్చని సంతోషంగా వున్నారు. ఎగువ ప్రాంతంలోనూ అధికంగా వర్షం కురుస్తున్న కారణంగా వాగులు, వంకలకు అధికంగా చేరుతున్నాయని నీటి కారణం గా వరదలు వచ్చే ప్రమాదం వుందని అధికారులు అప్రమత్తంగా వుండాలని రైతులు కోరుతున్నారు.

వైద్య రంగంలో ఆర్‌ఎంపీల పాత్ర కీలకం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైద్యరంగంలో ఆర్‌ఎంపీ డాక్టర్ల పాత్ర కీలకమేనని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ పేర్కొన్నారు. స్థానిక ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో తూర్పు మండలాల ఆర్‌ఎంపీ డాక్టర్లతో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యాన్ని అందించి స్వాంతన చేకూరుస్తున్నారని కొనియాడారు. ఆర్‌ఎంపి వైద్యులకు ఎంజీఎం ఆసుపత్రి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక డిఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆసరా పేరిట సింహపురి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సనత్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి ప్రతి నెలా మూడవ ఆదివారం క్రమం తప్పకుండా 20 మందికి నెలకు సరిపడా సరుకులు ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వీరు రెడ్డి సంఘానికే కాకుండా అనేక సేవా సంస్థలకు సహాయ సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండి శ్రీనివాసులు రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఘనంగా ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జనసేన యువ నాయకులు ఆరణి మదన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కేక్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన చిన్న కుమారుడు జగన్ తో కలిసి కట్ చేశారు. అనంతరం 18, 19 డివిజన్ లలో జేఎంసి ట్రస్ట్ తరుపున ఏర్పాటు చేసిన రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ల ను ఎమ్మెల్యే ఆరణి, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడులు ప్రారంభించారు. ఎంఆర్ పల్లి పరిధిలోని రెండు డివిజన్ ల్లో రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను జెఎంసి ట్రస్ట్ తరుపున ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవకోనలోనూ రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను మూడు నెలల క్రితం సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు సికే రేవతి, వరికుంట్ల నారాయణ, పొన్నాల చంద్ర, ఎస్ కే బాబు, మహేష్ యాదవ్, రాజా రెడ్డి, నీలాద్రీ, వివేక్, ఉదయ్ కుమార్, జానకి రామ్ రెడ్డి, దుర్గా మల్లేష్, మురళీ, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆళ్వార్ మురళీ, ఆముదాల వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి ఏది?

- ప్రభుత్వాలు మారుతున్నా మౌలిక సౌకర్యాలు కరువు
- తేలికపాటి వర్షానికీ నడవలేని పరిస్థితి
- ఇబ్బందుల్లో దళితవాడ

తేలికపాటి వర్షానికే బురదమయమైన దళితవాడ వీధి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గ్రామీణ ప్రాంతాలను తమ ప్రభుత్వ హయాంలో బాగా అభివృద్ధి చేస్తున్నామని, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి ఏ ప్రభుత్వ హయాంలోనూ చేయని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వ పాలకుల మాటలు ఎక్కడా కానరావడం లేదు. కనీసం తేలికపాటి వర్షం కురిసినా ఆ దళితవాడ వాసులు వీధుల్లో తిరగాలన్నా ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులకు, అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా తమ గ్రామంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

మౌలిక సౌకర్యాలు కరువు

వెంకటగిరి మండలం సోమసానిగుంట పంచాయతీ పాలకొండసత్రం గ్రామం అరుంధతివాడలోని వీధుల్లో తేలికపాటి వర్షం కురిసినా వీధుల్లో నీళ్ల చేరి బురదమయం అవుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుండి ఈ దళితవాడలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయలేదు. మురుగు కాలువలు వున్నాయి. అయితే వర్షపు నీరు అందులో వెళ్లకపోవడంతో వీధులు బురదమయం అవుతున్నాయి. దీంతో వీధుల్లో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకోని ప్రభుత్వాలు

ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడ పరిస్థితి మారడంలేదు. గత ప్రభుత్వం హయాంలో అధికారులకు, పాలకులకు ఎన్నో అర్జీలు సమర్పించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ పాలకులు తమను పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని పాలకొండసత్రం గ్రామం అరుంధతివాడ వాసులు ఎదురుచూస్తున్నారు.

హామీలు అమలు చేయాలి

ఆటో వర్కర్స్ యూనియన్ పిలుపు

తిరుపతిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ నెల 19 వ తేదీ తిరుపతిలో నిర్వహించనున్న ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, దీని ద్వారా ఆటో కార్మికుల బతుకులు బజారున పడకుండా రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు యువగళంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి 15 వేల రూపాయలు ఇస్తామని, డ్రైవర్ల సంక్షేమ బాధ్యతను తీసుకుంటామని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, ప్రమాద బీమా హెల్త్ ఇన్సూరెన్స్ ఆటో ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని వీటిని నెరవేర్చాలని కోరారు. ఆర్టీవో, పోలీసుల దాడుల నుంచి ఆటో డ్రైవర్లను అపరాధాలు వసూలు చేయకుండా వారికి టార్గెట్స్ ఇవ్వకుండా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది వాహన మిత్రులను అమలు చేస్తానని హామీ ఇచ్చారని, ఓలా, ఉబర్ రాపిడో వల్ల ఆటో కార్మికులకు సంపద మొత్తం కోల్పోతున్నారని వారికి ప్రభుత్వం తరఫున ఒక యాప్ ను ఇవ్వాలని కేరళ తమిళనాడు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వమే యాప్‌ను ఇస్తోందని అలా ఇవ్వాలని డిమాండు చేశారు. జీవో నెంబర్ 21ని పూర్తిస్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఆటో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ జయ చంద్ర, సిఐటియు నగర అధ్యక్షులు టి సుబ్రమణ్యం, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి టి మురళి నగర ప్రధాన కార్యదర్శి వాసు అధ్యక్షులు బాదుల్లా, రవి, మురగ, రమణ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ఈనెల 19వ తేదీన వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆటో వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా రెండవ మహాసభలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. పుత్తూరు ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మహాసభల కరపత్రం ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఆటో యూనియన్ కార్యదర్శి ఏ విజయ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఆటో కార్మికుల సమస్యపై అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించామన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానం ప్రకారం పెట్రోల్ , డీజిల్ ధరలు తగ్గించాలని, సబ్సిడీ ఎలక్ట్రికల్ ఆటోలు అందించాలని ఆటో స్టాండ్ లోనే చార్జింగ్ పాయింటును ఏర్పాటు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉచిత బస్సు పథకం ఆటో కార్మికుల జీవితాలకు అడ్డంకిగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. ఈ మహాసభలో ఈ సమస్యలన్నింటిని చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలోని ఆటో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ విజయ్, యాషన్ బాష, రామలింగం, సుబ్రహ్మణ్యం, దేవారెడ్డి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి

తుడా విసి శుభం బన్సల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వం ప్రకటించిన అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ పేర్కొన్నారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోలేని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కల్పించడానికి, 2025 జూన్ 30కి ముందు వేసిన అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను ప్రణాళిక బద్ధంగా తీసుకొచ్చేందుకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. ఈ పథకం మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంటు ప్లాన్లు పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో ఆమోదించబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా కానీ, స్వయంగా కానీ అనధికార లేఅవుట్ లో ఉన్న స్థలాల ప్లాన్లు తయారుచేసుకుని అపరాధ రుసుంతో 50 శాతం, 10 వేల రూపాయలకు తగ్గకుండా చెల్లించి నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజులలోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రం ప్లాన్లతో ఆన్‌లైను పోర్టల్ డిటిసిపి.ఎపి.జివొవి.ఇన్ ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అక్రమ లేఅవుట్ వేసిన యాజమాన్యం అందులో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు..

సహకరించాలని ప్రజా సంఘాల పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని ఏడు కాలనీల సెంటర్‌లో (ఎస్‌వి మెడికల్ కాలేజ్ కూడలి) వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణం ముందుకు సాగకుండా పెత్తం దారులు అడ్డుకుంటున్నారని వాటి ఆటలు సాగవని, అందరూ తమకు సహరించాలని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యమాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ కోరారు. ఏడు కాలనీల సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏడు కాలనీల మాజీ ప్రెసిడెంట్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు కాలనీల సెంటర్లో అంబేద్కర్ భవన నిర్మాణాన్ని అగ్రకులాల నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వివిధ ప్రజా, కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి త్వరలోనే అడ్డంకులు అధిగమించి అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఇక్కడ అంబేద్కర్ భవన నిర్మాణాన్ని ఆపాలని చూస్తే తిరుపతి నగరంలో అధిక శాతం ఉన్న మాల మాదిగల ఉగ్రరూపం ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యమాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్, ఏడు కాలనీల ప్రెసిడెంట్ రమేష్ కుమార్, కార్యదర్శులు వెంకటేష్, జయప్రకాష్, ఉపాధ్యక్షులు దేవరాజులు, అరుణ్ కుమార్, కార్పొరేటర్లు ఎస్కే బాబు, అనిల్ కుమార్, అడ్వైజర్ రాజశేఖర్, ఇతర దళిత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని టిడిపి సీనియర్ నేత, సంఘసేవకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్న క్రీడాకారిణులను ఆదివారం ఆయన కలిశారు. ఆట నైపుణ్యాలను వివరించారు. క్రీడల వల్ల కలిగే లాభాలను వివరించారు. ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాది వెంకటస్వామి పాల్గొన్నారు.

శివుని సేవలో గుజరాత్ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుజరాత్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జడ్జి సునీత అగర్వాల్ ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు కేతు సర్ప దోష నివారణ పూజ చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

నగరి నియోజక వర్గంలో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందే నిమిత్తం బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం పంపిణీ చేశారు. పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని వినాయక పురానికి చెందిన ఏడీ సరస్వతికి రూ.42,477, వడమాల పేట మండలం టిసి అగ్రహారానికి చెందిన ఎం శంకరయ్యకు రూ.62,038, చింతల పట్టెడకు చెందిన రూ.44,041, నగరిటౌన్‌కు చెందిన ఎన్‌సిశేఖర్‌కు రూ.48,734 చెక్కులు అందించారు. ఎంవి ఏకాంబరానికి రూ.18 వేలు, సత్రవాడకు చెందిన ఎ షణ్ముగంకు రూ.41,084, నగరి రూరల్ మండలం కెజి కుప్పంకు చెందిన జి నాగూర్ కు రూ.48,734, నింద్ర మండలం పాదిరికి చెందిన అజయ్‌కు రూ.66,500, మొత్తం ఎనిమిది మందికి రూ.3,67,074 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట మండలం ఎస్‌విఆర్ పురం సర్పంచ్ మణిరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏసీఏ జాయింట్ సెక్రటరీగా క్రికెట్ విజయ్

జిల్లాకు ఏసీఏలో మొట్టమొదట స్థానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలలో తిరుపతికి చెందిన విజయ్‌కుమార్ (క్రికెట్ విజయ్) జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఏసీఏలో ఇంత వరకు పదవులు దక్కిన దాఖలాలు లేవు. 1953లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసిఏ) స్థాపించబడింది. అప్పటినుంచి ఇప్పటివరకు క్రికెట్ చరిత్రలో దాదాపు 72 సంవత్సరాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఏసీఏ లో పోటీ చేసిన దాఖలాలు, గెలిచిన దాఖలాలు లేవు. 72 సంవత్సరాల తరువాత మొట్టమొదట తిరుపకి చెందిన విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఏసీఏ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించడంపై క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో క్రికెట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయడంతో పాటు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్‌గా ఆయన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ప్రతి క్రికెటర్ గొప్ప క్రికెటర్ కావాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్ అభివృద్ధి చెందాలని ఆయన చేసిన కృషి మరువలేనిది. ఇంటిపేరును సైతం క్రికెట్ విజయ్‌గా మార్చుకున్న విజయ్ కుమార్ ఏసీఏ జాయింట్ సెక్రటరీగా ఎంపిక కావడంపై జిల్లా, రాష్ట్ర నాయకులు, క్రికెట్ అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ నెల 3వ తేదీ నామినేషన్లు ముగిసి, 6వ తేదీ నామినేషన్‌న్లు పరిశీలించారు. నామినేషన్లలో ఒక్క జాయింట్ సెక్రటరీ పదవికి తప్ప అన్ని పదవులకు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీ పోస్ట్‌కు తిరుపతి నుంచి విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్), న్యూ క్రికెట్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరాజు నామినేషన్లు దాఖలు చేశారు. 11వ తేదీ స్క్రూటీలో శ్రీనివాసరాజు నామినేషన్ చెల్లకపోవడంతో అతని నామినేషన్ రద్దు చేశారు. దీంతో పోటీ జరగాల్సిన జాయింట్ సెక్రెటరీ ఒక్క పోస్ట్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఎన్నికలలో ఏ పోస్టుకు ఎటువంటి పోటీ లేకపోవడంతో ఏసిఏ ఫలితాలను వెల్లడించింది. దీంతో ఏసిఏ అధ్యక్షులుగా కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శిగా సానా సతీష్ బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా విజయ్ కుమార్(క్రికెట్ విజయ్), కౌన్సిలర్ గా విష్ణుదంతు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ కమిటీ, కోచ్ లు, క్రికెటర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎంఎఎస్ నూతన శాఖ ఏర్పాటు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగరంలో బైరాగి పట్టడ లోని వీక్ష ది స్కూలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తిరుపతి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎంఎఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా డాక్టరు పాకనాటి హరికృష్ణ, (ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్, ఎస్వీయూ), కార్యదర్శిగా పి రామచంద్రయ్య, (టిటిడి ఏఇఇ), కోశాధికారిగా కృష్ణ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారుగా కె నేతాజీ, ఉపాధ్యక్షులుగా ఓం ప్రకాష్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ రావు, రాఘవులు, డాక్టరు బి వెంకటేశ్వర్లు, సి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టరు రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీస్ గా రెడ్డప్ప, రమేష్, రఘు, ఆచార్య నాగలక్ష్మి దేవమ్మను ఎన్నుకున్నారు. ఈసీ మెంబర్లుగా ధర్మయ్య, అశోక్ రెడ్డి, భాస్కర్ యాదవ్ ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ కార్యదర్శి రామచంద్రయ్య మాట్లాడుతూ ఇండియా, ఆసియా, ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌లకు అనుబంధంగా పనిచేస్తామన్నారు.

ఉచిత బస్సు సౌకర్యంపై హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పుత్తూరు రూరల్ మండలం రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లిలో ఆదివారం జనసేన నాయకులు శ్రీరామ్ గోపి రాయల్ ఆధ్వర్యంలో మహిళలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం హరి, వరప్రసాద్, అమృతమ్మ, లక్ష్మి, సుబ్బమ్మ, దివ్య, మునెమ్మ, జె బాంబు రాయల్, బి జగ్గయ్య రాయల్, జి జానకమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మాజీ మంత్రి పరసారత్నం భార్య కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్, డాక్టర్ అంబేద్కర్ పూలే ఫౌండేషన్ చైర్మన్ పరసారత్నం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర , పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ పరసారత్నం భార్య జ్ఞాపకార్థం 5వ వర్ధంతి సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం, రోగులకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పరసారత్నం మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ విద్య వైద్యానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తన భార్య కస్తూరమ్మ వైద్య వృత్తిలో ఎంతోమంది పేదలకు సేవలు అందించి పలువురికి ఆదర్శం అయ్యారని తెలిపారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి పరసారత్నం సతీమణి వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ ఎస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరు భరత్ కుమార్ ,అన్ని కుల సంఘాల ప్రతినిధులు ఆల్ మెన్ రాజు, నరసింహ యాదవ్, సుగుణమ్మ,, సి ఆర్ రాజన్, మాజీ మంత్రి గోపాల కృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, పరసారత్నం అల్లుడు సతీష్ చంద్ర, నగేష్, పరమశివం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గుడ్లు , కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్‌ఆర్ జనరల్ మర్చంట్ అధినేత ప్రభాకర్ దాతృత్వంలో విశ్రాంత ఉద్యోగుల భయంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కూరగాయలు, గుడ్లు ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథి గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ జెవివి వంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ అనేక సేవా కార్యక్రమాలలో జెవివి పాల్గొనడం చాలా అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు 12 ఏళ్లుగా భోజనాలు పంపిణీ చేస్తున్నామని జెవివి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాసఆచారి, అశోక్, అరుణ్ కుమార్, దినేష్, జాన సుధీర్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో కూరపాటిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలం లోని కాంపాళ్యం పంచాయతీలో ఆదివారం నిర్వహిం చిన శ్రీకృ ష్ణాష్టమి వేడు కల్లో ఆదివారం కాంపాలెం పంచాయతీకి సత్యవేడు నియో జక వర్గం ప్రోగ్రాం ఆర్గనైజర్ శంకర్ రెడ్డి హాజర య్యా రు. ఈ కార్యక్ర మం మండల టిడిపి ప్రెసిడెంటు సుధాకర్ నాయు డు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డి నేటర్ శంకర్ రెడ్డి కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా స్వర భారతి వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

ప్రముఖ సాంస్కృతిక సంస్థ స్వర భారతి వార్షికోత్సవాన్ని ఆదివారం కేటి రోడ్ లోని అరబిందో ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. కుమారి కొమండూరి అభిజ్ఞ వైజయంతి స్వాగత నృత్యంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వర భారతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొమండూరి శేషాద్రి అధ్యక్షత వహించగా కళా ప్రపూర్ణ కూచి సాయి శంకర్, విహెచ్‌పి తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు కే వసుంధర, సంస్కార భారతి చైర్మన్ రాజేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం తంత్రీవాద్య విశేషాలపై టికెవి రామానుజాచార్యులు చేసిన సంగీతోపన్యాసానికి కృష్ణవంశీ మృదంగ వాయిద్య సహకారం సమకూర్చారు. కొమండూరి అభిరామ కౌశిక్, కుమారి ఆద్య బాలాజీ గీతాలాపన చేశారు. స్వర భారతి ప్రధాన కార్యదర్శి కొ మాండూరి శరద్యుతి, నిర్వాహకులు డాక్టర్ కొమండూరి వెంకటకృష్ణ కళాకారులను సంస్థ తరఫున సత్కరించి అభినందించారు.